సాక్షి ఒడిశా

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,25,370లు, బంగారం 18గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 36 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



16వ ఆర్థిక సంఘానికి అభ్యర్థన

రాష్ట్రం ఆర్థిక పురోగతి కోసం కొత్త పంచవర్ష ప్రణాళిక కింద అధిక నిధుల కేటాయింపు, రాష్ట్ర మంజూరు వాటా పెంపుదల కోసం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి 16వ ఆర్థిక సంఘానికి అభ్యర్థించారు. - 8లో



పోలీసుల అదుపులో డొంగిరియా యువకులు - 8లో

జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పరిధిలో గల నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ముగ్గురు యువకులను బుధవారం అర్ధరాత్రి పొరుగు జిల్లా కలహండికి చెందిన పోలీసులు తీసుకెళ్లారు.

న్యూస్‌రీల్

ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం



వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని శిఖపల్లి పంచాయతీ ఎంవీ 19 గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరం గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయుష్మాన్ వైద్యాధికారి డా.మహేశ్ కుమార్ బరిక్, శిఖపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వర్ణప్రభ రౌయి, సంతోషిరాయ్‌లు రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5 గ్రామాలకు చెందిన సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా రెండో సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

రాయగడ: నదీతీర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి అడాజోర్ పంచాయతీ పరిధి కిషకంక్‌బెడి గ్రామ సమీపంలోని నదీతీరంలో నాటుసారా తయారీ జరుగుతుందన్న సమాచారం మేరకు దాడులను చేపట్టారు. దాడుల్లో 2,500 లీటర్ల నాటుసారా తయారీ కోసం వినియోగించే ఊట, మరో 60 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే పోలీసులు దాడుల సమాచారం తెలుసుకున్న తయారీదారులు అక్కడి నుంచి పరారయ్యారు.

70 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: అక్రమంగా 70 కిలోల గంజాయిని తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశామని అబ్కారీ నిఘా విభాగం ఉప సూపరింటెండెంట్ శృతికాంత్ రౌత తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాం జిల్లా అస్కా ప్రాంతంలో బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా, మినీ వ్యానులో 70 కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించి పైలట్, వెనుక వ్యానుకు ఎస్కార్ట్‌గా వస్తున్న కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి పరాయి కావడంతో నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. నిందితులు కందమాల్ జిల్లా దారింగిబాడి నుంచి గంజాయిని తీసుకువచ్చి గంజాం జిల్లా పురుషోత్తపూర్‌కు తరలించి, అక్కడి నుంచి ప్యాకింగ్ చేసి ముంబాయి తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



విజేతలతో ఎస్పీ శ్రవణ్ వివేక్, అతిథులు

బరంపురం: టెన్నిస్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలని ఎస్పీ డాక్టర్ శ్రవణ్ వివేక్ అన్నారు. యూనియన్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా బరంపురం క్లబ్ మైదానంలో జరుగుతున్న ఐత జీడీటీఏ ఓటీఏ సూపర్ సీరీస్ అండర్-16 బాల,బాలికల టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర సింగిల్స్ ఫైనల్లో ఒడిశాకు చెందిన టాప్ సీడ్ అహాన్ మిశ్రా 6-4, 7-5తో తమిళనాడుకు చెందిన ఫజల్ అలీమీర్‌పై విజయం సాధించాడు. బాలికల విభాగంలో టాప్ సీడ్ అహాన్ 6-1, 6-4తో బెంగాల్‌కు చెందిన రియా రాయ్‌పై గెలిపొంది విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ డైరెక్టర్ బి.స్వరంజన్ పట్నాయక్, టోర్నమెంట్ కార్యదర్శి ఉమాశంకర్ పాధి, రిఫరీ జతిన్ బత్స్యా, జీడీటీఏ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్‌లు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



వేదికపై బాబిలత షరప్, ఆర్‌కే ప్రధాన్, బాసంతరాయ్ తదితరులు

రాయగడ: అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు సూచించారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తోందని డీఐసీ జనరల్ మేనేజర్ బిజయ్ సాహు అన్నారు. జిల్లాలో ఎన్నో బృహత్తర పరిశ్రమలు ఉన్నాయని, టెక్నికల్ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆయా రంగాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయగడ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరప్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బినయ్ కుమార్ బాసంతరాయ్, బిసంకటక్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆర్‌కే ప్రధాన్, బీఈవో సుదీప్త దాస్, రాయగడ సీటీటీసీ అధికారి సంతోష్ కుమార్ స్వయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందడి

జాబ్‌మేళాలో విద్యార్థుల సందడి కనిపించింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం జాబ్ అవకాశాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసింది. గోపాలపూర్ నుంచి వచ్చిన ఆర్మీలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఆయా విభాగాలకు చెందినవారు వివరాలను వెల్లడించారు. ఆర్మీలో చేరేందుకు ఎక్కువ మంది యువతీ, యువకులు ఆసక్తికరంగా కనిపించి దరఖాస్తులు అందజేశారు. జాబ్‌మేళాలో జిల్లాలోని జేకే పేపర్ మిల్‌తో పాటు చిన్న, మధ్య తరహా కంపెనీలు పాల్గొన్నాయి.



వివిధ స్టాల్స్‌లో విద్యార్థుల సందడి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు



ఉపాధి అవకాశాల కోసం బారులుతీరిన విద్యార్థులు

కదం తొక్కిన మిషన్ శక్తి మహిళలు

కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు





ఏడీఎం నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

రాయగడ: న్యాయమైన తమ పది డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని మిషన్ శక్తి, జీవికా మిషన్‌కు చెందిన వందలాది మంది మహిళలు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పేరిట ఒక వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్‌కు సమర్పించారు. నిఖిల్ ఒడిశా మిషన్ శక్తి మహిళా సంఘం రాయగడ శాఖ అధ్యక్షురాలు మమత పాణిగ్రాహి, కార్యదర్శి కుమారి పాలక నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళన సుమారు రెండు గంటల పాటుగా జరిగింది. స్థానిక పీడబ్ల్యూడీ బంగ్లా నుంచి ర్యాలీగా వచ్చిన మహిళలు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన మిషన్ శక్తి, జీవికా మిషన్ వంటి పథకాల వల్ల ఎంతో మంది మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో ఉన్నతి చెందారని మమతా పాణిగ్రాహి అన్నారు. అయితే రాష్ట్రంలో కొలువు దీరిన కొత్త ప్రభుత్వం మిషన్ శక్తి, జీవికా మిషన్ పథకాల్లో కొత్త రీస్ట్రక్చరింగ్ పేరుతో కొత్త పుంతలు తొక్కించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. దీని వల్ల ఎందరో మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగే మిషన్ శక్తి, జీవికా మిషన్ పథకాలను కొనసాగించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిషన్ శక్తి, జీవికా మిషన్ పథకాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జయంతి దాస్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

క్రీడలూ చదువులో భాగమే



ప్రసంగిస్తున్న డాక్టర్ రాజకుమార్

జయపురం: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉత్తమ నాగరికులుగా ఎదగాలని ఐటీఈఆర్ యూనివర్సిటీ భువనేశ్వర్ డీన్ డాక్టర్ రాజకుమార్ హొత్త సూచించారు. జయపురం నెహ్రూనగర్ తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహిస్తున్న సిటీ ఉన్నత పాఠశాల క్రీడా ఉత్సవ పోటీల్లో విజేతల బహుమతుల ప్రదాన ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చదువుల్లో క్రీడలు ఒక భాగమని విద్యార్థులు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేస్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదాన ఉత్సవంలో సిటీ హైస్కూలు కమిటీ అధ్యక్షులు ఎ.శ్రీనివాస రావు, తెలుగు సాంస్కృతిక సమితి కార్యదర్శి వై.శ్రీనివాస ఖన్నా, సిటీ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి.సుజాత, సిటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయిక్, వైస్ ప్రిన్సిపాల్ సుశ్మిత సాహు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ రాజకుమార్ హొత్త విజేతలకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు.



విజేత బాలునికి బహుమతి ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథి



విజేత బాలికకు బహుమతి అందిస్తున్న దృశ్యం

పూరీ పరిరక్షణకు అండ



నగరంలో కళాభూమి సందర్శనలో ఆర్థిక సంఘం అధ్యక్షుడు



పూరీ శ్రీ మందిరంలో పూజాదులు నిర్వహించిన ఆర్థిక సంఘం సభ్యులు

భువనేశ్వర్: విశ్వ విఖ్యాత పూరీ క్షేత్రం వారసత్వ విలువల పరిరక్షణతో బహుముఖ అభివృద్ధికి 16వ ఆర్థిక సంఘం అండగా నిలుస్తుందని చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా తెలిపారు. ఆయన నేతృత్వంలో రాష్ట్ర పర్యటన కొనసాగిస్తున్న ఆర్థిక సంఘం సభ్యులు పూరీ శ్రీ జగన్నాథ ఆలయం సందర్శించి పూజాదుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూరీ రాజ్‌భవన్‌లో పూరీ మున్సిపాలిటీ అధికారులతో ఆర్థిక సంఘం ముఖ్యమైన సమావేశాన్ని కూడా నిర్వహించింది. ప్రాచీన ఆలయ నగరంలో ఆర్థిక కేటాయింపులు, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పౌర సౌకర్యాలను పెంపొందించే వ్యూహాలపై దృష్టి సారించాయి. సమావేశంలో పూరీ మున్సిపల్ అధికారులు పట్టణం డిమాండ్లని నొక్కి చెప్పారు. వీటిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, పవిత్ర నగరమైన పూరీకి పెరుగుతున్న యాత్రికుల సంఖ్యకు మద్దతుగా మెరుగైన మౌలిక సదుపాయాల ఆవశ్యకత వంటివి ప్రధానమైనవిగా పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను సిఫారసు చేసేందుకు పరిశీలిస్తుందని ఆర్థిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ పనగరియా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక సంఘం స్థానిక బ్లూ ఫ్లాగ్ సాగర తీరం సందర్శించింది. అనంతరం యునెస్కో ప్రపంచ వారసత్వ పర్యాటక కేంద్రమైన కోణార్క్‌లోని సూర్య దేవాలయం సందర్శించారు. రాజధాని నగరంలో కళా భూమి ప్రాంగణం సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు.

మునిగుడలో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరు యువకులను ఆర్‌పీఎఫ్ సిబ్బంది బుధవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 32.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో కందమాల్ జిల్లాకు చెందిన రుతుంగయా పోలీస్‌స్టేషన్ పరిధి ఉహాకియా గ్రామానికి చెందిన శ్రీధర్ మాలిక్, సిద్ధాంత్ మాలిక్‌లు ఉన్నారు. బస్టాండ్ నుంచి వీరిద్దరు గంజాయిని బ్యాగులో పెట్టుకొని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఎప్పటిలాగే ఆర్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించడంతో బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు తరలించారు.

ఇద్దరు మోసగాళ్ల అరెస్టు



బంగారు ఆభరణాలు శుభ్రం పేరుతో మోసం చేస్తున్న నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పులిమెట్ల గ్రామంలో గురువారం బంగారం శుభ్రం చేస్తామని బీహార్‌కు చెందిన ఇద్దరు మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో కొద్ది రోజులుగా బంగారం శుభ్రం చేస్తామని ఓ ముఠా తిరుగుతోంది. బీహార్‌కు చెందిన విజయ్ సాహ(38), చందన్ కుమార్ సాహ(46) అనే ఇద్దరు సుశీల్ సర్కార్ అనే వ్యక్తి ఇంటికి జనవరి 29 వ తేదీన వెళ్లి వెండి, ఇత్తడి, బంగారం వస్తువులు శుభ్రం చేస్తామని చెప్పి ముందుగా.. వెండి ఇతర వస్తువులు శుభ్రం చేశారు. బంగారం ఉంటే ఇవ్వండని అడగడంతో సుశీల్ భార్య ఓ బంగారు గొలుసు ఇచ్చింది. తొలుత యాసిడ్‌తో కడిగినట్టు చూపించి ఓ తెల్లకాగితంలో చుట్టి అరగంట తర్వాత తీయాలని చెప్పి వారు వెళ్లిపోయారు. అరగంట పోయాక చూస్తే అందులో గొలుసు లేదు. మోసపోయామని గ్రహించాక మల్కన్‌గిరి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఐఐసీ రీగాన్ కీండోకు ఫిర్యాదు చేశారు. మోసగాళ్లు ఇద్దరూ పులిమేట్ల గ్రామంలో కనిపించడంతో గ్రామస్తులు దేహశుద్ధి చేసి కలిమెల పోలీసులకు అప్పగించారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి పోలీసులకు అప్పగించారు. దొంగిలించిన బంగారాన్ని కరిగించి అమ్మేశారని చెప్పడంతో.. శ్రీనివాస్ అనే వ్యాపారి వద్దకు వెళ్లి బంగారం స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



కళాశాల క్రికెట్ జట్టుకు పురస్కారం

పర్లాకిమిడి: అతి పురాతన కృష్ణ చంద్ర గజపతి కళాశాలను విశ్వవిద్యాలయంగా గుర్తించేందుకు అసెంబ్లీలో ప్రతిపాదన లేవనెత్తుతానని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కృష్ణచంద్ర గజపతి (స్వయంప్రతిపత్తి) కళాశాల వార్షికోత్సవంలో ప్రకటించారు. గురువారం కళాశాల వార్షికోత్సవం నిర్వహించగా.. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుధవారం రాత్రి కళాశాల వార్షికోత్సవం డాక్టర్ సత్యనారాయణ రాజ్‌గురు ఓపెన్ స్టేజీ వద్ద జరిగింది. ఇందులో గౌరవ అతిథులుగా సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, పండిత రఘునాథ పాత్రో, ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయిక్, స్టూడెంట్స్ కల్చరల్ సెక్రటరీ రాధా కాంత భుయ్యాన్, ముఖ్యవక్తగా గోలాప్‌చంద్ర ఫిలిఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రామహరి కార్జి కళాశాల గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు అనేక రంగాల్లో సాధించిన విజయాలను చదివి వినిపించారు. ఈ కళాశాలను 1896లో అప్పటి మహారాజా స్వర్గీయ గౌరచంద్ర గజపతి నిర్మించగా, 1936లో ఆయన కుమారుడు శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ హైస్కూల్‌ను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్టు ప్రిన్సిపల్ జితేంద్రనాథ్ పట్నాయిక్ తెలిపారు. ఈ కళాశాలకు కేంద్రం నాక్ గ్రేడ్ సి గుర్తింపు ఇచ్చింది. ఈ ఆటోనమస్ కళాశాలను విశ్వవిద్యాలయం గుర్తింపు కోసం ఈ ప్రాంతపు పూర్వపు విద్యార్థులు అనేక సార్లు ఆందోళన చేశారని ప్రిన్సిపల్ గుర్తుకు తెచ్చారు. ఈ కళాశాలలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ అన్ని రంగాలలో విజయవంతం అవ్వాలని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనిత పాత్రో కోరారు. అనంతరం పలు ఇంటర్నల్ గేమ్స్, వక్తృత్వ, డిబేటింగ్, స్పోర్ట్స్, డ్యాన్సు పోటీలలో విజయం సాధించిన వారికి షీల్డులు అందజేశారు. అనంతరం కళాశాల విద్యార్థినులు ఒడిస్సీ, సంబల్‌పురి డ్యాన్సులతో అలరించారు. అధ్యాపకులు సయ్యద్ అబ్దుల్ రెహామాన్ సభకు ధన్యవాదాలు తెలిపారు.



వార్షికోత్సవంలో ఆల్ రౌండర్ విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



కళాశాల విద్యార్థుల నృత్య రూపకం



కళాశాల విద్యార్థిని నిహారిక పూజారికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ మరియు రఘునాథ పాత్రో

క్లుప్తంగా

కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, రచయిత బద్రి కూర్మారావు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో కిడ్నీవ్యాధి మూలాలు, అక్కడి పరిస్థితులకు అక్షర రూపమిస్తూ రచించిన 'కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పరాజు పలాసలో గురువారం ఆవిష్కరించారు. రంగోయి గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు బద్రి కూర్మారావు ఈ పుస్తకాన్ని రచించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, నాయకులు శిష్టు గోపి, జినగ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం


వ్యక్తి మృతదేహం

పొందూరు: పొందూరు రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ శ్రీకాకుళం రైల్వే ఎస్‌ఐ మధుసూదనరావు గురువారం తెలిపారు. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, ఆకుపచ్చ షార్టు ధరించి ఉన్నాడని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 9493474582 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్ రూపకర్తకు ఎస్పీ అభినందనలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా పోలీసుల నూతన వెబ్‌సైట్ 'శ్రీకాకుళంపోలీస్.ఎపి.జివొవి.ఇన్' రూపకల్పన చేసిన కంచిలి మండలం కేసరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్‌ని ఎస్పీ కె.మహేశ్వరరెడ్డి గురువారం అభినందించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నగదు, ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన నవీన్ విద్యార్థి దశలోనే ప్రతిభ కనబరిచి ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీస్ శాఖ పూర్తి వివరాలు తెలుసుకునేలా వెబ్‌సైట్ రూపకల్పన చేయడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. 10వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయని ఆర్‌ఐఓ పి. దుర్గారావు తెలిపారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభమవుతాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వరకూ జరుగుతాయన్నారు. మొత్తం 40356 మంది (ఫస్టియర్ 20,389, సెకండియర్ 19,967 మంది) విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 37,976 మంది సాధారణ, 2380 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. 75 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఎలాంటి సాంకేతిక లోపం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయానికి విద్యార్థులు కచ్చితంగా హాజరు కావాలన్నారు.

16వ ఆర్థిక సంఘానికి అభ్యర్థన

- రూ.12.59 లక్షల కోట్లకు పైగా రాష్ట్రం డిమాండ్


ఆర్థిక సంఘం ప్రముఖుల సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రం ఆర్థిక పురోగతి కోసం కొత్త పంచవర్ష ప్రణాళిక కింద అధిక నిధుల కేటాయింపు, రాష్ట్ర మంజూరు వాటా పెంపుదల కోసం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి 16వ ఆర్థిక సంఘానికి అభ్యర్థించారు. పట్టణీకరణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. 2026–2031 పంచ వర్ష ప్రణాళిక కింద రాష్ట్రానికి రూ. 12.59 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించాలని కోరారు. గురువారం భువనేశ్వర్‌లో రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ మేరకు అభ్యర్థించారు. 2026 నుంచి 2031 వరకు రాష్ట్ర ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళికకు ఆర్థిక అవసరాలను గట్టెక్కించడం ఈ ప్రతిపాదనల లక్ష్యంగా పేర్కొన్నారు.

రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) కు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ నిధిలో 75 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన 25 శాతం రాష్ట్రం భరిస్తుంది. రాష్ట్ర తరచుగా ప్రకృతి వైపరీత్యాలకు ఒడిశా గురై సతమతం అవుతోంది. ఈ విపత్కర పరిస్థితుల దృష్ట్యా విపత్తు స్పందన నిధిని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వాటా మినహాయించి పూర్తి భారాన్ని స్వీకరించాలని వివరించారు. రాష్ట్రానికి పన్నుల వాటా పెంపొందించాలన్నారు. కేటాయించిన పన్నుల వాటాను ప్రస్తుతం కొనసాగుతున్న 41 శాతం వాటాని 50 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఈ మార్పు రాష్ట్ర ప్రాంతీయ ఆర్థిక పురోగతికి దోహదపడుతుందన్నారు.

దేశంలో ఒక రాష్ట్ర జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు వాటాకు 15 శాతం ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ ప్రామాణికతని సంస్కరించాల్సి ఉంది. 80 ఏళ్ల పైబడిన వయో వృద్ధ జనాబా, బలహీన వర్గాల జనాబా ప్రామాణిక కింద కేటాయింపులకు ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.


రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశంలో ఆర్థిక సంఘం ప్రముఖులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం బీజేడీ అభ్యర్థన

భువనేశ్వర్: 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర పర్యటన సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని విపక్ష బిజూ జనతా దళ్ అభ్యర్థించింది. ఈ మేరకు లిఖిత పూర్వకంగా వినతి పత్రం సమర్పించిందని విపక్ష నేత నవీన్ పట్నాయక్ తెలిపారు. ప్రతిపక్ష హోదాలో రాష్ట్రం, రాష్ట్ర ప్రజల పట్ల బీజేడీ నిబద్ధత ఎప్పటికీ తగ్గేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా పరిధిని ప్రస్తుత స్థాయి 42 శాతం నుండి 50 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. రాష్ట్ర పాలన పనితీరు ఆధారంగా అనుబంధ కార్యక్రమాలకు సముచిత ప్రోత్సాహకాలతో ప్రోత్సహించడం అనివార్యంగా పేర్కొన్నారు. వాతావరణ మార్పుల స్థితిగతుల దృష్ట్యా రాష్ట్రం ఎదుర్కొనే ప్రమాదం ఉన్నందున 15వ ఆర్థిక సంఘం సిఫార్సులలో 10 శాతం ప్రాధాన్యతని 20 శాతానికి పెంచాలని, విద్యుత్, వ్యవసాయం, నీటిపారుదల, రోడ్లు, వంతెనలు, ఆనకట్టలు, రిజర్వాయర్లు మొదలైన వాటిలో విపత్తు తట్టుకునే మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి ఈ పెంపు ఉపకరిస్తుందని బీజేడీ వివరించింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న విపత్తు నిర్వహణ నిధి వాటా 90:10 బదులుగా 100 శాతం కేంద్ర ప్రభుత్వం భరించాలని బీజేడీ ప్రతిపాదించింది.

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి


వికశిత గ్రామం-వికశిత ఒడిశా ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే, ప్రజలు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: దేశానికి గ్రామీణ ప్రాంతాలే పట్టుగొమ్మలని అవి ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందిన నాడే దేశం ప్రగతి సాధిస్తుందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక బ్లాక్ డవలప్‌మెంట్ కార్యాలయం(సమితి)లో బుధవారం వికశిత గ్రామం–వికశిత ఒడిశా కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహణ మఝి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జయపురంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ కన్న కలలు నిజం కావాలి అంటే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేందాలలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్య, క్రీడా, రహదారులు, రక్షిత తాగునీరు, సాగునీరు, తదితర మౌలిక సౌకర్యాలతోపాటు పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాలని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమానికి జయపురం బీడీఓ శక్తి మహాపాత్రో అధ్యక్షత వహించారు. సమితి చైర్ పర్సన్ తిలోత్తమ ముదులి, వైస్ చైర్మన్ గణేష్ పాడీ, జిల్లా పరిషత్ సభ్యులు రశ్మీరథ్, అస్థా నాయక్, ఏబీడీఓ మనోజ్ కుమార్ నాయక్, జీపీఈఓ భగీరథి నాయక్, సర్పంచ్‌లు కమళ లోచన గదబ, బొలిభద్ర పూజారి, సబిత నాయక్, బబుల దిసారి, శివ భూమియ, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయక్, కాంగ్రెస్ నేత దేవేంద్ర బాహిణీ పతి, మిషన్ శక్తి మహిళలు పాల్గొన్నారు.

శిశు సురక్షపై అవగాహన


మాట్లాడుతున్న బీడీఓ లారీమాన్ ఖర్సల్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో ముఖ్యంగా గర్ల్స్‌పై అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులపై పర్లాకిమిడి, గుమ్మా, రాయఘడ, గుసాని, ఆర్.ఉదయగిరి బ్లాక్ కార్యాలయాల్లో గురువారం ఒక్కరోజు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదివాసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లు, మేట్రిన్స్‌కు శిశు సురక్షపై ఒక్కరోజు శిక్షణ శిబిరాన్ని ఆర్.ఉదయగిరి బ్లాక్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో జిల్లా సురక్షా సమితి అధ్యక్షుడు అశ్వినీకుమార్ మహాపాత్రో, జిల్లా శిశు సంరక్షణ అధికారి (డి.సి.పి.యు.) అరుణ్‌కుమార్ త్రిపాఠి, ఆర్.ఉదయగిరి బీడీఓ లారీమాన్ ఖర్సల్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సాల్మన్ రైక, తదతరులు పాల్గొని సూచనలు చేశారు.


శిక్షణలో పాల్గొన్న సూపరింటెండెంట్లు, మాట్రిన్స్

కేరళ దంపతులకు చిన్నారి దత్తత


చిన్నారిని అప్పగిస్తున్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టర్ చాంబర్‌లో గురువారం కేరళకు చెందిన దంపతులకు చిన్నారిని జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి ఆధ్వర్యంలో అధికారికంగా అప్పగించారు. మూడేళ్ల క్రితం సంతానం లేని కేరళ రాష్ట్రానికి చెందిన దంపతులు కేంద్ర సంతాన దత్తత రిసోర్స్ కేంద్రం (ఢిల్లీ) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. నాలుగు మాసాల చిన్నారికి వైద్య పరీక్షలు చేసిన అనంతరం కేరళ దంపతులు దత్తత తీసుకోవడానికి అంగీకరించారు. ఇప్పటివరకు జిల్లా నిశాన్ సలోన్ శిశు దత్తత కేంద్రం నుంచి 67 మంది శిశువులను వివిధ రాష్ట్రాల వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ సమితి అధ్యక్షులు అశ్వినీకుమార్ మహాపాత్రో, జిల్లా శిశు సంరక్షణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ త్రిపాఠి, చైల్డ్ వెల్ఫేర్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో డొంగిరియా యువకులు


కునాకండు గ్రామం


విలేకరులతో మాట్లాడుతున్న లొద సికక

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పరిధిలో గల నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ముగ్గురు యువకులను బుధవారం అర్థరాత్రి పొరుగు జిల్లా కలహండికి చెందిన పోలీసులు తీసుకెళ్లారు. యువకులను ఎందుకు అదుపులోకి తీసుకున్నారు, వారు చేసిన తప్పు ఏమిటన్న విషయాన్ని కూడా పోలీసులు వివరించకపోవడంతొ డొంగిరియా కొంధొ తెగకు చెందిన నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 21 వ తేదీ లోగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లిన వారిని విడిచిపెట్టకపోతే 21వ తేదిన లంజిఘడ్ వేదాంత్ కంపెనీ ఎదుట భారీ ఎత్తున ఆందొళన చేపట్టనున్నట్లు డొంగిరియా సురక్షా సమితి లొద సికక హెచ్చరించారు. ఈమేరకు విలేకర్ల సమావేశంలో ఆయన వివరించారు. వివరాల్లోకి వెళితే.. నియమగిరి ప్రాంతంలో డొంగిరియా తెగకు చెందిన నియమరాజ ఉత్సవాలకు సంబంధించి ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న వివిధ గ్రామాల్లో గల డొంగిరియా ప్రజలు చందాలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్శాలి పంచాయతీ పరిధిలో గల కునాకండు గ్రామానికి చెందిన సొన మాఝి, రెంగామాఝి, పలబెరి గ్రామానికి చెందిన పాత్ర మాఝి అనే ముగ్గురు యువకులు చందాలు వసూళ్లు చేయడానికి వెళ్తుండగా వారిని కలహండి పోలీసులు గురువారం రాత్రి వారిని అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానాలతో వారిని అరెస్టు చేసినట్లు సమాచారం.

డైనింగ్ రూమ్ ప్రారంభం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, తదితరులు

జయపురం: జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైనింగ్ రూమ్‌ను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి గురువారం ప్రారంభించారు. రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన డైనింగ్ రూమ్‌లో విద్యార్థులతోపాటు ఎమ్మెల్యే కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్ పట్నాయక్, ఉపాధ్యాయులు దుర్గా పాత్రో, భగవాన్ సాబత్, విశ్వరంజన్ గౌడ, ప్రభాతీ పాణిగ్రహి, హితకర్ చరిడిదీపక్ సాహు, తస్బీర్ మహమ్మద్, నిర్మల తండిక, సౌమ్యరంజన్ పట్నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు డైనింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండేవారని, డైనింగ్ హాల్ ఏర్పాటు కావటంతో భోజనాలు చేసేందుకు సౌకర్యం ఏర్పడిందన్నారు. విద్యార్థులకు రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని హెచ్‌ఎంకు ఆదేశించారు. పాఠశాలలో రక్షిత తాగునీటి సౌకర్యం సమకూర్చాలని సూచించారు.

స్కూటీతో సహా నగదు చోరీ

రాయగడ: స్థానిక న్యూకాలనీలో ఒక వ్యాపారి నుంచి స్కూటీతో సహా రూ.5 లక్షల నగదును గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ మేరకు బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గౌరీ శంకరరావు అనే వ్యక్తి వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.5 లక్షలు స్కూటీ డిక్కీలో ఉంచి, న్యూకాలనీలోని ఒక దుకాణం వద్దకు వెళ్లి సామాన్లు కొనుగోలు చేశాడు. అదే సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి స్కూటీని దొంగిలించాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్కూటీలో రూ.5 లక్షలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కళాశాల విద్యార్థినులకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేత



ఉన్నత విద్యే లక్ష్యం


బినోదినీ ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో ఆదివాసీ వెనుకబడిన ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యంగా బినోదినీ హైయ్యర్ సెకండరీ కళాశాల స్థాపించామని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. గుమ్మా బ్లాక్ పద్మపురంలో వున్న బినోదినీ హైయ్యర్ సెకండరీ కళాశాల 27 వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి హాజరై మాట్లాడారు. వార్షికోత్సవంలో డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి డాక్టర్ గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండల్ తదితరులు హాజరయ్యారు. ఈ ప్లస్‌టూ కళాశాలను తన నాన్నమ్మ బినోదినీ పాణిగ్రాహి పేరున 1997లో ఆరుగురు విద్యార్థులతో ప్రారంభించారని, అందులో ఇప్పుడు 600 మందికి పైగా విద్యార్థులు పాస్‌అవుట్ అయ్యి బయటకు వెళుతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ ఈ కళాశాలకు రూ.50 లక్షలతో స్మార్ట్ క్లాసులు, వైఫై అందజేశారని వారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీలు, వక్తృత్వ, డ్యాన్సు, క్విజ్ పోటీలలో విజేతలకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలును అందజేశారు.


ఉత్తమ విద్యార్థికి మెమెంటోతో పాటు ప్రశంసాపత్రంను అందజేస్తున్న డీఆర్‌డీఏ అధికారి నాయక్


క్రికెట్ జట్టు విజేతకు ట్రోఫీ అందజేత

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

జయపురం: జయపురం ఎస్.కె.టి రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గల వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షికోవత్సవం బుధవారం రాత్రి ముగిసింది. సాయంత్రం స్వామివారి విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంగళవారం నిర్వహించిన సమూహిక లక్ష్మీ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు లాటరీ నిర్వహించారు. ఆ లాటరీలో గెలిపొందిన 8 మందికి చీరలు, పసుపు కుంకుమతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని కొంతమంది భక్తులు స్పాన్సర్ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.


స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో నైవేద్యం


లాటరీ విజేతలకు సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు


ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వామివారి ఉత్సవ విగ్రహాలు


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు


స్వామి వారికి ఉంజల్ సేవ

క్లుప్తంగా

సెల్‌షాపులో చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై సింహాచలం, సిబ్బంది

బలిజిపేట: మండల కేంద్రం బలిజిపేట ప్రధాన రహదారిలో ఉన్న సప్తగిరి సెల్‌షాపులో సుమారు రూ.85వేల సెల్‌ఫోన్లు, బ్లూటూత్‌లు చోరీకి గురయ్యాయి. షాపుయజమాని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చి చోరీ జరిగిన పర్యవేక్షించారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన కొత్తవి 8పెద్ద ఫోన్లు, 5బ్లూ టూత్‌లు పోయినట్లు షాపు యజమాని శ్రీనివాసరావు తెలిపారు. షాపు షట్టర్లకు ఉండే తాళాలు పగలకొట్టి చోరీ చేశారన్నారు. ఉదయం వచ్చి చూసే సమయానికి షట్టరు దిగువకు దించి ఉందని లోపల వస్తువులు పోయినవి లేనివి నిర్ధారణ చేసుకుని ఫిర్యాదు చేసినట్లు వాపోయాడు. దీనిపై ఎస్సై సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

కుక్కలదాడి ఐదుగొర్రెల మృతి



కుక్కలదాడిలో మృతిచెందిన గొర్రెలవద్ద విలపిస్తున్న రామస్వామి దంపతులు

బాడంగి: మండలంలోని పూడివలసలో గురువారం తెల్లవారుజామున జరిగిన కుక్కలదాడిలో గ్రామానికి చెందిన ఇప్పిలిరామస్వామి ఐదు గొర్రెలు మృతిచెందగా మరో 6గొర్రెలు గాయాలపాలై కొనఊపిరితో ఉన్నాయి. ఎప్పుడూ మాదిరిగానే తన గొర్రెలను శాలలో ఉంచగా కుక్కలు దాడిచేసి కరిచిచంపినట్లు బాధితుడు తెలిపాడు. మరో ఆరు గొర్రెల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందన్నారు. గతంలో కూడా రామస్వామి గొర్రెలు కుక్కల దాడిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయాలైన గొర్రెలకు పశువైద్యాధికారి సతీష్ వైద్యచికిత్స అందజేశారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధుడి అదృశ్యం



సత్యం

బాడంగి: మండలంలోని గజరాయునివలసకు చెందిన దాసరి సత్యం(80)అనే వృద్ధుడు రెండు రోజులుగా కనిపించడం లేదని స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఆయన కుమారుడు రమణరావు ఇచ్చిన ఫిర్యాదులో బుధవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి మరుసటిరోజు వరకు ఇంటికి రాలేదని కావున పోలీసులు వెతికి తమకు అప్పగించాలని కోరినట్లు ఎస్సై ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారమివ్వాలని కోరారు.

విజయనగరంలో మరో వ్యక్తి..



పోలిపల్లి ఏసు

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెంలో నివాసం ఉంటున్న పోలిపల్లి ఏసు జనవరి 29 నుంచి కనబడడం లేదని కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. తోటపాలెంలో నివాసం ఉంటున్న ఏసు జనవరి 29న రాత్రి 10 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకూ ఇంటికి రాలేదని, అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదని ఆయన భార్య పోలిపల్లి సంతోషి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గరివిడిలో చోరీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని జగన్నాథ కాలనీలో చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి పట్టణంలోని జగన్నాథ కాలనీలో నివాసం ఉంటున్న బాసిన సతీష్ ఈనెల 2వ తేదీన పనినిమిత్తం బయటకు వెళ్లాడు. ఈ నెల 5న రాత్రి 8గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి ముందర గ్రిల్స్ గేటు విరగ్గొట్టి తలుపులు తెరిచి లోపల ఉన్న బెడ్‌రూంలోకి ప్రవేశించి బీరువా తలుపులు బలవంతంగా తెరిచి అందులో ఉన్న వస్త్రాలను చెల్లాచెదురు చేసినట్లు ఉన్నాయి. బీరువా లాకర్‌లో ఉన్న రెండు బంగారపు ఉంగరాలు(ఒక్కొక్కటి పావుతులం) 5వేల రూపాయలు నగదు దొంగతనానికి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు సతీష్ తామెవరూ ఇంటిలో లేనప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ దొంగతనం జరిగిన ప్రాంతంలో కొన్ని ఆధారాలను సేకరించింది.

భుజంగరావు బంగారం



హైదరాబాద్‌లోని కళాభారతి షోలో భుజంగరావు డ్యాన్స్ పెర్‌ఫార్మెన్స్

ఆ యువకుడు చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. నడిచేందుకు కాళ్లు సహకరించవు. చదివేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలించదు. అసలే పేదరికం. తల్లిదండ్రులు రోజువారీ వలస కూలీలు. దీంతో జీవన పోరాటం ఎదురీత అయింది. అయినా పట్టుదల, ఆత్మస్థైర్యం ఉన్నత చదువులు చదివేలా చేసింది. మంచి డ్యాన్సర్‌గా రాణించేలా చేసింది. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ఆ యువకుడే రాజాం మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన బంగారి భుజంగరావు. ఈ యువకుడు నెలరోజులుగా ఫేమస్ అయ్యాడు. గతేడాది డిసెంబర్ 31 రాత్రి చేసిన ఓ డ్యాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లక్షలాదిమంది లైక్‌లు సొంతంచేసుకున్న భుజంగరావు వేలాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఆ యువకుడి జీవన ప్రస్థానం ఇలా ఉంది.

-రాజాం

- డ్యాన్స్‌లో రాణిస్తున్న యువకుడు
- అంగవైకల్యాన్ని ఎదురించి జీవనపోరాటం
- మరిన్ని అవకాశాల కోసం ఎదురుచూపు

భుజంగరావు స్వగ్రామం తెర్లాం మండలంలోని ఉద్దవోలు. తల్లిదండ్రులు మరియమ్మ, జోగారావులు రోజువారీ వలస కూలీలు కావడంతో రాజాం మండలం పెనుబాక రావడంతో ఇక్కడికి వచ్చిన భుజంగరావు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బొద్దాం జెడ్పీ హైస్కూల్‌లో చేరి పట్టుదలతో 10వ తరగతి వరకూ చదివాడు. ప్రతిరోజూ ట్రై సైకిల్‌పై వెళ్లి, ఒక పూట తినకుండా పస్తులు ఉంటూ ఆ రోజుల్లో పదవతరగతి పూర్తిచేశాడు. అనంతరం రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన ఆయనను రాజాంలోని పలువురు దాతలు ప్రోత్సహించారు. ఫలితంగా సామర్లకోటలో తెలుగు పండిట్ ట్రెనింగ్ కళాశాలలో తెలుగు పండిట్ కోర్సు పూర్తిచేశాడు. అనంతరం రెండు డీఎస్సీలకు ప్రిపేరయ్యాడు. ఒకటి రెండు మార్కులతో టీచర్ ఉద్యోగాన్ని కోల్పోయిన బంగారురాజు తన పట్టు వదలలేదు. తాను 8 వ తరగతి చదువుతున్న సమయం నుంచే రాజాంలోని బాలభవన్ బాటపట్టాడు. అక్కడి డ్యాన్స్ మాస్టర్ సుంకరి రమేష్ ప్రోత్సాహంతో పాటు డ్యాన్స్ మాస్టర్ తారక్ సారథ్యంలో డ్యాన్స్ నేర్చుకుని మంచి డ్యాన్సర్‌గా ఖ్యాతి గడించాడు. పదిమంది దివ్యాంగులను ఒక్కటిగా చేసి డ్యాన్స్ ట్రూప్ తయారుచేసుకుని, తాను బతుకుతూ పదిమందిని బతికిస్తూ ముందుకువెళ్తున్నాడు.



పుష్ప-2 సినిమాలోని గంగో రేణుకా తల్లి సాంగ్‌కి భుజంగరావు డ్యాన్స్



ఓ స్టేజ్ షోలో భుజంగరావు

ఎన్నో షోలు..

భుజంగరావు ఇప్పటివరకూ 40కిపైగా టీవీ, ప్రమోషన్ షోల్లో నటించాడు. శ్రీదేవి డ్రామా కంపెనీలోని కాంచన సినిమాలో నిల్చో..నిల్చో సొంత కాళ్లపైన నిల్చో అనే పాటకు మణికంఠ మాస్టర్ టీమ్‌లో డ్యాన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. అనంతరం ఢీ సెలబ్రెటీ స్పెషల్-1లో మణికంఠ మాస్టర్ కొరియగ్రాఫ్‌లో డ్యాన్స్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చాడు. ఏడాది క్రితం మారో మారో గోలీ మారో సాంగ్‌లో పెరఫార్మెన్స్ చేశాడు. చంద్రముఖి-2 సినిమా ప్రీ రిలీజ్‌లో దంచుకోట సాంగ్‌కి లారెన్స్ మాస్టర్ సారథ్యంలో డ్యాన్స్ చేసి బహుమతి పొందాడు. గతేడాది 31న పుష్ప-2 సినిమాలోని గంగో రేణుకా తల్లి సాంగ్‌కి డ్యాన్స్ చేసి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాడు. పెద్దపెద్ద సినీ నటులు, సెలబ్రిటీలతో పరిచయాలు ఉన్న భుజంగరావు తోటి దివ్యాంగులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా, రాజాం చుట్టు పక్కల దివ్యాంగులకు ఏదో ఒక కళ ఉండాలని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్నాడు. ఇటీవల ఎన్‌టీఆర్ సినీ వజ్రోత్సవ అవార్డును విశాఖపట్నంలో పౌర గ్రంథాలయంలో సినీ ప్రముఖల చేతుల మీదుగా అందుకున్నాడు. అంతకుముందు కాకినాడలో చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ పురస్కారం అందుకున్నాడు. ప్రైవేట్ షోల్లో పలు పురస్కారాలు భుజంగరావును వరించాయి.

మంచి టీచర్‌గా.. మంచి డ్యాన్సర్‌గా పేరుకోసం..

నాకు చిన్నప్పటినుంచి టీచర్ అవ్వాలని ఉండేది. అందుకే ఎంతో కష్టపడి తెలుగుపండిట్ ట్రైనింగ్ అయ్యాను. నేను శిక్షణ పొంది బయటకు వచ్చిన తరువాత డీఎస్సీలు తగ్గిపోయాయి. తెలుగు పండిట్ టీచర్ పోస్టులు కూడా పెద్దగా లేవు. చిన్నప్పటినుంచి ఎంతో ఇష్టంతో నేర్చుకున్న డ్యాన్స్ ఇప్పుడు జీవనోపాధి కల్పిస్తోంది.



డ్యాన్స్‌మాస్టర్ లారెన్స్‌తో భుజంగరావు

తన ఇబ్బందులు కుటుంబానికి రాకుండా

భుజంగరావు మంచి భవిష్యత్‌కోసం పరితపిస్తున్నాడు. 2019లో పొందూరుకు చెందిన నాగమణి అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె నిహారిక 1 వ తరగతి పెనుబాక పాఠశాలలో చదువుతోంది. రెండవ కుమార్తె సాత్విక ఏడాదిన్నర వయస్సు ఉంటుంది. తాను కుటుంబానికి భారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో స్టేజ్ షోలు చేస్తున్న భుజంగరావు అవకాశాలు వచ్చినప్పుడల్లా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి టీవీషోలు, సినీ ప్రమోషన్ షోల్లో తన డ్యాన్స్‌తో ప్రతిభ చాటుతున్నాడు. నిత్యం ఏదో ఒక స్టేజ్ షో చేస్తూ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాడు.

- పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులపై నీలినీడలు
- అమ్మవారి జాతర పూర్తికాగానే సెలవుపై వెళ్లిపోయిన ఈఓ
- అశోక్ గజపతిరాజుపై కేసు పెట్టించారనే నెపంతోనే ఈఓపై కక్షసాధింపు!
- ఏడాదికి రూ.4 కోట్లకి పైగా ఆదాయం వస్తున్నా కానరాని అభివృద్ధి

అడుగడుగునా ఆటంకాలే..

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. విజయనగర ప్రజల ఇలవేల్పు.. పైడితల్లి అమ్మవారు. భక్తుల కొంగుబంగారంగా పిలిచే అమ్మవారి ఆలయ అభివృద్ధిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కినుకవహిస్తోంది. అధికారులపై కక్షసాధింపు ధోరణితో అభివృద్ధి పనులను పక్కనపెడుతోంది. ఆలయ విశిష్టతను మసకబార్చే ప్రయత్నాలపై భక్తలోకం మండిపడుతోంది.

2018లో ప్రారంభించిన పనులు 2023 నాటికి 60 శాతం పూర్తయినా మిగులు పనుల పూర్తికి కనీసం చర్యలు తీసుకోకపోవడం భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. ఏడాదికి రూ.4 కోట్లకు పైగా ఆదాయం వస్తున్న పైడితల్లి అమ్మవారి ఆలయం విస్తరణ పనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.





ఆలయానికి ఇరువైపులా ఉన్న షాపుల తాళాలను ఆలయ అధికారులు, ట్రస్టు బోర్డు మెంబర్లకు అందజేస్తున్న వర్తకులు(ఫైల్)

అప్పట్లో పనుల్లో జోరు..

పైడితల్లి ఆలయ ఈఓలుగా పనిచేసిన భానురాజా, జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్‌డీవీవీ ప్రసాద్, సుధారాణి పర్యవేక్షణలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయ అధికారులపై వేధింపులు ప్రారంభమయ్యాయి. పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ.. ఇలా ప్రతిచోటా గత ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేసిన ఉద్యోగులపై వేటు వేస్తూ వచ్చారు. 2021 డిసెంబర్ నెలలో రామతీర్థం రామాలయ పునర్నిర్మాణ శంకుస్థాపనను అడ్డుకుని ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుపై అప్పట్లో రామతీర్థం ఈఓగా పనిచేసిన డీవీవీ ప్రసాదరావు ఫిర్యాదు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పైడితల్లి ఆలయ ఈవోగా పనిచేస్తున్న ప్రసాదరావుపై వేధింపులు ఆరంభించారు. గతేడాది అక్టోబర్‌లో పైడితల్లి అమ్మవారి జాతర పూర్తికాగానే నవంబర్ నెలలోనే ఆయన సెలవు పెట్టేసి వెళ్లిపోయారు. ఫలితం.. ఆలయానికి ఇరువైపులా ఉన్న షాపుల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. పెండింగ్‌లో ఉన్న రెండు భవనాల పరిస్థితి కూడా అలాగే ఉండిపోయింది. ఆలయానికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. తాత్కాలిక పనులకు కూడా నోచుకోలేని దుస్థితి దాపురించింది. విశాఖ కనకమహాలక్ష్మి ఆలయ రూపంలో తీర్చిదిద్దాలనే సంకల్పం మసకబారింది.

అన్నింటా జాప్యమే..

పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆలయం ప్రస్తుతం 1316 చదరపు గజాల్లో ఉంది. ఆలయానికి పక్కన ఉన్న షాపులను తొలగించిన తర్వాత 3055.52 చదరపు గజాల స్థలం అదనంగా వస్తుంది. 4,371 చదరపు గజాల్లో అమ్మవారి ఆలయం సువిశాలంగా నిర్మించే అవకాశం ఉంది. దాతల సహకారంతో ఆలయానికి ఎదురుగా ఉన్న ఎడ్వర్డు ఆస్పత్రి స్థలాన్ని రూ.1,19,4,975లకు కొనుగోలు చేశారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న షాపుల యజమానులకు ఆ స్థలాన్ని ఇవ్వడమే కాకుండా స్ట్రక్చర్ వేల్యూ కింద ఇప్పటికే రూ.1,57,04,085లు అందజేశారు. మరో రెండు షాపులకు సంబంధించి ఇంకా సుమారు రెండున్నరకోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. చిన్నచిన్న వివాదాలతో అది కొలిక్కిరాలేదు.



పైడితల్లి అమ్మవారు

నిర్మించాల్సినవి ఇవే..

పైడితల్లి అమ్మవారి ఆలయం విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అన్నప్రసాదశాల, క్యూ కాంప్లెక్స్, కుంకుమ పూజా మండపం, కేశ ఖండనశాల, కార్యాలయం నిర్మించాల్సి ఉంది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అష్టోత్తర, సామూహిక కుంకుమార్చనలు చేసేందుకు ప్రస్తుతం స్థలం సరిపడడంలేదు. స్థలం ఉన్నా వాటిని అభివృద్ధి చేసే నాథుడు లేకపోవడంతో ఆలయానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ప్రస్తుతం రెండు క్యూలు ద్వారా మాత్రమే భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. క్యూ కాంప్లెక్స్‌ను సైతం నిర్మించాల్సి ఉంది. ఆలయానికి ఇరువైపులా ఉన్న రామకృష్ణ వస్త్రాలయం, సెల్‌షాప్, ఆయుర్వేదం షాపు, బరంపురం సిల్క్స్, స్టూడెంట్ ఎంపోరియంలు ఇప్పటికే అమ్మవారికి స్థలాన్ని అప్పగించేసి, ఎదురుగా పైడితల్లి దేవస్థానం ఇచ్చిన స్థలంలో కట్టుకుని ఆలయ అభివృద్ధికి సహకరించారు. ఇంకా పారడైజ్ హోటల్, సిటీ స్కాన్స్ చిన్నపాటి లిటిగేషన్‌లో ఉండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లా...



పైడితల్లి అమ్మవారి ఆలయ విస్తరణ పనుల అంశం ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాను. గతేడాది నవంబర్ నెల చివరిలో ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాను. ప్రస్తుతం ఉన్న ఆలయం గోడలు తొలగించి వాస్తురీత్యా నిర్మాణానికి వేదపండితులు, స్థపతి వచ్చి పరిశీలించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యేల ఆదేశాలతో తాత్కాలిక అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయానికి పక్కన ఉన్న పారాడైజ్, సిటీ స్కాన్స్ విషయమై చర్చిస్తున్నాం. అవి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

– కేఎన్‌వీడీవీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్, ఈఓ, మాన్సాస్, ఇన్‌చార్జి ఈఓ, పైడితల్లి దేవస్థానం

కోసలి సమీపంలో ఏనుగుల విధ్వంసం

భామిని: మండలంలోని కోసలి రైతులకు పంటనష్టాలు కలిగించడంలో నాలుగు ఏనుగుల గుంపు గురువారం తలమునకలైంది. ఘనసర-తాలాడ గ్రామాల సమీపంలోని ఏనుగులు కోసలి వైపు నడిచి రైతులు పండించే మొక్కజొన్న, కర్బూజా, ఇతర కూరగాయల పంటలపై దాడి చేసి తినివేస్తున్నట్లు బాధిత రైతులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఏనుగుల గుంపు తిష్ఠ వేసినట్లు కోసలి గ్రామస్తులను ఫారెస్ట్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టి ద్విచక్ర వాహన చోదకుడి మృతి

చీపురుపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన దన్నాన శ్రీనివాసరావు(35) ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి మృతిచెందాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చీపురుపల్లి నుంచి గరివిడి వైపు వెళ్తున్న ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీనివాసరావు బలంగా ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విజయరాంపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు విశాఖపట్టణంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ చీపురుపల్లి నుంచి రైలులో ప్రయాణించి విశాఖలో పని ముగించుకుని తిరిగి వస్తుంటాడు. అయితే తన భార్య, పిల్లలు గజ్జింగివలసలోని అత్తవారింట్లో ఉండడంతో వారి వద్దకు బుధవారం రాత్రి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘాట్‌రోడ్డులో మరో వ్యక్తి..

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారి ఘాట్‌రోడ్డుపై గురువారం ఉదయం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లారీ ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తుండగా సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్‌కు చెందిన సుందరి కృష్ణ (25) అక్కడికక్కడే మతి చెందాడు, లారీ క్లీనర్, స్కూటీ వెనుక కూర్చున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వారిద్దరినీ సాలురు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడని, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన హెచ్‌సీ కృపారావు తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం





మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జీఏవీ రమణ, ఎస్సై జయంతి,(ఇన్‌సెట్‌లో) గౌరమ్మ (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని గుచ్చిమి గ్రామ సమీపంలో గల ఆయిల్ పాం తోటలో చుక్కపేట గ్రామానికి గ్రామానికి చెందిన యాకల గౌరమ్మపై(44) ఆమె భర్త సత్యం కొడవలితో దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుచ్చిమి గ్రామంలోని పొలాల్లో వరి కంకులు కోయడానికి గౌరమ్మ చుక్కపేట నుంచి ఉదయం బయల్దేరి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన భర్త కొడవలితో ఆమె ఒంటిపైన చెవులు, తలపైన దాడి చేయడంతో పొలాలకు వెళ్లే చిన్నపాటి దారిలో కుప్పకూలిపోయింది. కిందపడిన ఆమె ఒంటిపై కొడవలితో తీవ్రగాయాలు చేశాడు. ఈ విషయాన్ని సమీపంలో పనులు చేస్తున్న స్థానికులు గమనించి మృతురాలి కుటుంబసభ్యులు, 108వాహనానికి సమాచారం అందించారు. సమాచారం మేరకు వచ్చిన 108 సిబ్బంది గౌరమ్మను పరిశీలించి అక్కడికక్కడే మృతిచెందినట్లు నిర్ధారించారు. తల్లి గాయాలపాలైందని తెలుసుకుని వచ్చిన కుమారుడు గణేష్, కుమార్తె భవానిలు మృతిచెందిన తల్లిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పెదమానాపురం ఎస్సై జయంతి సిబ్బంది చుట్టు పక్కల పరిశీలించి కొద్ది దూరంలో పడి ఉన్న కొడవలిని గమనించారు. సంఘటనా స్థలానికి గజపతినగరం సీఐ జీఏవీ రమణ వచ్చి క్లూస్ టీమ్‌ను రప్పించి నిందితుడు ఎటు వైపు నుంచి తప్పించుకుని పారిపోయాడో పరిశీలించారు. కుమారుడు గణేష్ సీఐఎస్ఎఫ్ ఉద్యోగం చేస్తూ సెలవుపై వచ్చి ఇంటి వద్ద ఉన్నాడు, కుమర్తె కూడా ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు పొలంపనికి వెళ్తుండగా గొడవ పడి తల్లి మృతి చెందడంతో పిల్లలిద్దరూ గుండెలవిసేలా రోదిస్తున్నారు.

మామిడి పూతకు మంచుదెబ్బ





విజయనగరం జిల్లాలో కొద్దిరోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఈ ప్రభావంతో మామిడి పూత మాడిపోతోంది. ఈ ఏడాది పూత బాగా రావడంతో దిగుబడులు బాగుంటాయని రైతులు ఆశించారు. పొగ మంచుతో పూత దెబ్బతినడం ఆందోళనకు గురిచేస్తోంది. గజపతినగరం రోడ్డులో మంచు ప్రభావంతో మాడిపోతున్న పూతను చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం